


# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 16 2024 | సంపుటి :0 | సంచిక : 38 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## మోదీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య



### ప్రధాని మోదీ ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. జార్ఖండ్ లో ఈ ఘటన చోటుచేసుకుంది.

రాంచీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఎదురైంది. జార్ఖండ్ లో ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో దిల్లీకి ప్రధాని తిరుగు ప్రయాణం ఆలస్యమైనట్లు అధికారులు వెల్లడించారు.ఎన్నికల ప్రచారం నిమిత్తం ఈ ఉదయం ప్రధాని మోదీజార్ఖండ్ లో పర్యటించారు. రెండు ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొన్నారు. దాన్ని ముగించుకుని దిల్లీ తిరిగి వెళ్లేందుకు దేవ్‌గఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే ప్రధాని ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అవ్వలేదు. ప్రస్తుతం సాంకేతిక బృందం సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది.మరోవైపు, ఇదే రోజున జార్ఖండ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్ కూడా గంటకు పైగా నిలిచిపోయింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి అనుమతి రాకపోవడంతో గోడ్డాలో ఆగిపోయింది. దీంతో రాహుల్ గాంధీ షెడ్యూల్‌కు ఆటంకం ఏర్పడింది. అయితే, దీనికి భాజపానే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది. జార్ఖండ్‌లో ఈ నెల 13న తొలి విడత పోలింగ్ జరగ్గా.. నవంబరు 20న మహారాష్ట్రతో పాటు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడించనున్నారు.

## లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ కుట్ర

### రైతులను రెచ్చగొడుతున్న కేటీఆర్, హరీశ్‌రావు : మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, లగచర్ల ఘటన బీఆర్ఎస్ పార్టీ కుట్రేనని, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులూ ఉన్నా రైతులకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటామని అన్నారు.ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి తమకు అప్పగించారని విమర్శించారు.

## 7411ధాన్యం కొనుగోలు

### కేంద్రాలు ఏర్పాటు చేశాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



వరి సాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కోటీ 53లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో సన్న రకాలు 25నుంచి 40లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడమే అందుకు కారణమని అన్నారు. సంక్రాంతి నుంచి రేషన్‌తో సహా అన్ని హాస్టళ్లకు సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దొడ్డు రకం వరి సాగు 41లక్షల నుంచి 21 లక్షల ఎకరాలకు పడిపోయిందని చెప్పారు. రాష్ట్ర అవసరాలే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

- కాంగ్రెస్ పార్టీకి ఏటిఎంగా తెలంగాణ రాష్ట్రం
- కెసిఆర్ బాటలోనే సిఎం రేవంత్ రెడ్డి
- తిట్ల పురాణంతో తెలంగాణ పరువు తీస్తున్నారు
- పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- చర్చల వ్యవహారం..కలెక్టర్‌పై దాడి వరకు వెళ్లింది
- మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు...
- పేదల ఇళ్లు కూల్చివేతకే తాము వ్యతిరేకం
- మూసీ పరివాహక ఇళ్లల్లో నేడు బిజెపి నేతల నిద్ర
- రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారు
- శిల్పకళావేదికలో 21 నుంచి 24 వరకు లోక్ మంథన్
- మీడియా సమావేశంలో బిజెపి నేత, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,మాజీ సిఎ కెసిఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల డిఎన్ఎ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మాటలు, విమర్శలతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ లతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటిఎంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఫైరయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బస్తీ దావఖానాలు నడుస్తున్నాయని ఆయన చెప్పారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే.. ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన వ్యవహారం.. కలెక్టర్ పై దాడి వరకు వెళ్లింది. సిఎం సొంత నియోజకవర్గంలో దాడి జరగడం, రైతుల అరెస్టులు.. అసలు ఏం జరుగుతుందని సర్కార్‌ను నిలదీశారు. రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే సత్తా ఈ సర్కార్ కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీని

## సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

- సొంత ప్రయోజనాల కోసం కొందరు తప్పుడు ప్రచారాలు
- ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి
- విధుల్లో 87వేల ఎన్యుమరేటర్లు



కొందరు కావాలనే వారి ప్రయోజనాల కోసం సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమరేటర్లను పెట్టి సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



## ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

- గిరిజనులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత మాదే
- పీఎం జన్‌మన్ యోజన పథకం ఘనత ముర్మదే
- బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నివాళి
- బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ
- ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ

## మామీద కోపంతో పేదలకు నష్టం



- రైతులను జైళ్ల నుంచి విడుదల చేయాలి
- రేవంత్‌కు తప్పకుండా పేదోడి ఉసురు తగులుతుంది : కేటీఆర్

మామీద ఉన్న కోపంతో పేదలకు నష్టం చేయొద్దని, సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు... ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగులతది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సమగ్ర సర్వేపై తప్పుడుప్రచారం చేస్తే సహించం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు.

"గ్రంథాలయాలు నిరుద్యోగ యువతకు చదువుకోవడానికి ఉపయోగపడేలా చేయాలి. ఈరోజు ఎంప్లాయ్‌మెంట్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చింది. చదివిన జ్ఞానం జీవితంలో ఏదో చోట ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఏం జరుగుతుంది అనేది తెలుసుకునే వేదిక గ్రంథాలయం. సిద్దిపేట గ్రంథాలయం రాష్ట్ర గ్రంథాలయాలకు దీటుగా అభివృద్ధి చేస్తాం. నెహ్రూ ఐఐటీ, ఎయిమ్స్, విద్యాలయాలు, సాంకేతికత రంగంలో అభివృద్ధి చేయడం వల్లనే నేడు దేశం ముందుకు వెళ్తుంది. నెహ్రూ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. బ్రాంచ్ లైబ్రరీల సంఖ్య తక్కువగా ఉంది కావాల్సిన మెటీరియల్ అందించాలి" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుంది.. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు రాద్ధాంతం చేయకుండా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాకో సీనియర్ అధికారిని నియమించి ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్నామన్నారు. కాళేశ్వరం లేకున్నా కాళేశ్వరం ద్వారా పంటలు బాగా పండాయని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైస్ మిల్లర్ల విషయంలో ఎక్కడ ఇబ్బంది లేదని చెప్పారు. 20 మంది డిఫల్టర్‌లు ఉన్నారు.. ప్రభుత్వ బకాయిలు చెల్లించి మీరు కొనుగోలులో పాల్గొనాలని కోరారు. 101 మంది రైస్ మిల్లర్లు ఉన్నారు..వారు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ కుట్ర

మొదటిపేజీ తరువాయి

అయినా తాము నిధులు సమకూర్చుకుంటున్నామని చెప్పారు. హరీష్ రావు ఆందోళన పడాలి ప్రజాస్వామికంగా మేము ముందుకు వెళ్తున్నాం. భయబ్రాంతులకు గురి చేస్తాం, యంత్రాంగాన్ని భయపెడతాం అంటే కరెక్టేనా. ప్రభుత్వాన్ని అస్థిర పరిచే కుట్ర జరుగుతోంది. బీఆర్ఎస్ , బీజేపీ కలిసి కుట్ర చేస్తున్నాయి" అని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు విమర్శించారు.

# 7411ధాన్యం కొనుగోలు

## కేంద్రాలు ఏర్పాటు చేశాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మొదటిపేజీ తరువాయి

7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారం కోల్పోయిన పార్టీ అధికారం కోసం రైతుల ఆత్మ స్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. "అన్ని గ్రామ పంచాయితీల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టం. వడ్లు ఆరపోసిన దగ్గర రైతులు ఆందోళన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్య పోరు ఉండొచ్చు. రాష్ట్రంలో రెండో స్థానం కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు ఉండొచ్చు. మీ ఆధిపత్య పోరు కోసం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేయొద్దు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే మేము ధాన్యం కొనాలి. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్చండి..కృత్రిమ ఆందోళనతో శునకానందం పొందడం సరికాదు. సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చాక రైతు భరోసా ఇస్తాం. రైతులను ఇబ్బంది పెట్టే రాజకీయ క్రీడను పార్టీలు మానుకోవాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో 'ఎన్నికల తనిఖీలు'..

## తాజాగా అమిత్ షా హెలికాప్టర్



మొదటిపేజీ తరువాయి

**హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం కోసం వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు.**

దిల్లీ: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల వేళ.. ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం కోసం వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన ఆయన.. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

"ఎన్నికల ప్రచారం కోసం ఇక్కడకు వచ్చిన క్రమంలో నా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. నిష్పక్షపాత, ఆరోగ్యకరమైన ఎన్నికల వ్యవస్థను భాజపా విశ్వసిస్తోంది. ఇందుకు మనమంతా సహకరించాలి. ప్రపంచంలో శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌ను కొనసాగించడంలో మన బాధ్యతలను నిర్వర్తించాలి" అని అమిత్ షా పేర్కొన్నారు.

మోదీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పలుమార్లు తనిఖీ చేయడం ఇటీవల చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో ఇది సాధారణ ప్రక్రియే అంటూ ఈసీ కూడా క్లారిటీ ఇచ్చింది. అప్పటి నుంచి బ్యాగులు, హెలికాప్టర్ల తనిఖీల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బ్యాగులను అధికారులు తనిఖీ చేశారు. మహారాష్ట్రలో నవంబర్ 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## తూర్పు కమెంగ్ జిల్లాలో దారుణం

### ఉన్మాదిగా మారి పలువురిపై కత్తితో దాడి

ఒక వ్యక్తి ఉన్మాదిగా ప్రవర్తించి హాస్పిటల్‌లో భార్య, కుమార్తెతోపాటు మరో వ్యక్తిని కత్తితో పొడిచి చంపాడు. పోలీసులతోపాటు మరి కొందరిపై కత్తితో దాడి చేశాడు. చివరకు అతికష్టం మీద ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు కమెంగ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సెప్పాలోని జిల్లా ఆసుపత్రిలో 40 ఏళ్ల నికమ్ సంగ్బియా చెలరేగిపోయాడు. ప్రస్తుతం ఎక్కడా కనిపించని సాంప్రదాయక కత్తి 'దావో'తో భార్య,

# ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

మొదటిపేజీ తరువాయి

దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం

ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని



ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం



ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశామని.. బడ్జెట్‌ను రూ.25,000 కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని వెల్లడించారు.

# పినాకా రాకెట్ లాంచర్‌ను పరీక్షించిన డీఆర్‌డీఓ



పినాకా రాకెట్ లాంచర్‌ను శుక్రవారం డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా ఆ వెపన్ సిస్టమ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్‌ను డీఆర్డీవో డెవలప్ చేసింది. పినాకా ఆయుధ వ్యవస్థకు చెందిన రేంజ్, కచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని, ఫైరింగ్ రేట్‌ను పరీక్షించారు. ప్రొవిజినల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్స్ ట్రయల్స్‌లో భాగంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను టెస్ట్ చేశారు. పినాకా లాంచర్ల ద్వారా 12 రాకెట్లను ఫైరింగ్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేకిన్ ఇండియా ఉత్పత్తికి రక్షణ శాఖ ఊతం ఇస్తున్న సందర్భంగా ఇతర దేశాలు ఆ వెపన్ సిస్టమ్‌పై ఆసక్తి చూపుతున్నాయి. పినాకా మల్టీ బారెల్ రాకెట్ లాంచర్ పై ఫ్రాన్స్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన హిమార్స్ సిస్టమ్‌తో సమానంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను పోల్చుతున్నారు. రక్షణ ఉత్పత్తుల్లో పినాకా ఎగుమతి రికార్డు సృష్టించనున్నది. ఆర్మేనియా తొలుత వీటి కోసం ఆర్డర్ ఇచ్చింది. ఆర్మీని బలోపేతం చేసుకునేందుకు ఫ్రాన్స్ కూడా ఆ వెపన్ సిస్టమ్‌పై ఇంట్రెస్టింగ్‌గా ఉన్నది. మరికొన్ని వారాల్లో ఆ సిస్టమ్‌ను టెస్ట్ చేయనున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. శివుడి విల్లును పినాకం అని పిలుస్తారు. ఆ పేరుతో రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేశారు. భారత ఆర్మీ వద్ద ఉన్న రష్యన్ గ్రాడ్ బీఎం-12కు రీప్లేస్మెంట్‌గా ఈ రాకెట్ సిస్టమ్‌ను తయారు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో దీన్ని వినియోగించారు. వ్యూహాత్మకంగా ఎత్తు ప్రదేశాల్లో ఉన్న పాకిస్థాన్ స్థావరాలను పికానా సిస్టమ్ ద్వారా పేల్చివేశారు. ఆర్మమెంట్ రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ పినాకా రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేసింది. మల్టీ బారల్ రాకెట్ సిస్టమ్‌లో రెండు పాడ్స్ ఉంటాయి. వీటిల్లో ఆరేసి రాకెట్లను నింపుతారు. ఆ తర్వాత కేవలం 44 సెకన్లలోనే ఆ 12 రాకెట్లను ఫైర్ చేస్తారు. 700 ఇ 500 మీటర్ల ఏరియా ఆ ఫైరింగ్‌తో నేలమట్టం అవుతుంది. ఆ సిస్టమ్‌లో ఉన్న బ్యాటరీ మొత్తం 72 రాకెట్లను ఫైర్ చేయగలదు.

# రెండోరోజూ దిల్లీని కమ్మేసిన పొగమంచు

### వాయునాణ్యత సూచీ 400గా నమోదు

### ఆగ్రాలోని తాజ్‌మహల్ పరిసరాలను కమ్మేసిన పొగ మంచు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో దట్టమైన పొగమంచు అలముకుంది. వరుసగా రెండోరోజు వాయునాణ్యత సూచీ (ఏక్యూఐ) తీవ్రస్థాయికి చేరింది. గురువారం ఉదయం 428గా నమోదైంది. దీంతో కట్టడి చర్యల్లో భాగంగా దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ)3 అమలు చేస్తున్నట్లు ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ప్రకటించింది. శుక్రవారం నుంచి ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా దాదాపు 300 విమాన సర్వీసులు ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు.

### ప్రాథమిక పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులు

వాయుకాలుష్యం తీవ్రత పెరిగిన నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలు (ఐదో తరగతి వరకు) ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆతిశీ వెల్లడించారు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఇవి కొనసాగుతాయన్నారు. స్టేజ్ 3 ఆంక్షల ప్రకారం.. అత్యవసరం కాని నిర్మాణాలు, కూల్చివేతలపై నిషేధం ఉంటుంది. ఐదులోపు తరగతుల విద్యార్థులకు సెలవు ఇస్తారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి ఆతిశీ స్పందిస్తూ.. కాలుష్య తీవ్రత దృష్ట్యా అన్ని ప్రైమరీ స్కూల్ తరగతులు ఆన్‌లైన్‌కు మారుతున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు.

### గ్యాస్ చాంబర్‌లోకి వచ్చినట్టుగా ఉంది: ప్రియాంక

ప్రియాంకా గాంధీ దిల్లీ వాతావరణ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'కేరళలోని వయనాడ్ నుంచి దిల్లీకి తిరిగివచ్చాను. అక్కడ వాయు నాణ్యత సూచీ 35గా ఉంది. ఇక్కడ మాత్రం గ్యాస్ చాంబర్‌లోకి ప్రవేశించినట్టుగా అనిపిస్తోంది. ఎప్పటికప్పుడు దిల్లీలో కాలుష్యం పెరుగుతూనే ఉంది. పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారికి ఇది ఎంతో క్లిష్టమైన పరిస్థితి. పరిశుభ్రమైన గాలి కోసం అందరం కలిసి పార్టీలకు అతీతంగా పనిచేయాల్సి ఉంది' అని 'ఎక్స్' వేదికగా ప్రియాంక పిలుపునిచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం నవంబర్ 16 2024

# ప్రభుత్వం ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం



**కరపత్రం న్యూస్ గన్నేరువరం :నవంబర్ 15**

ఇటీవల వెలువడిన నోటిఫికేషన్ గ్రూప్ ఫోర్ ఫలితాల్లో గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన ఘర్షకుర్తి నవీన్ జూనియర్ అసిస్టెంట్, ఘర్షకుర్తి అరుణ్ సాయి వార్డ్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించారు. వీరిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి శుక్రవారం అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ యువత నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ఎదగాలని అన్నారు. మండలంలోని యువత ఉన్నంత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూమాడి కిరణ్ రెడ్డి, కర్షకుర్తి ప్రవీణ్, కూన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కు పుల్లూరినవీన్ కు సన్మానం.



**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, నవంబర్ 15.**

జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని మార్కెట్ యార్డు కమిటీలో డైరెక్టర్ గా పుల్లూరు నవీన్ ఎన్నికైనందున శుక్రవారం ఆవోప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు బండారి సదా శివ కుమార్, కార్యదర్శి పాంపట్టి అనిల్, పడిగెల శ్రీనివాస్, చిలమంతుల శివ కుమార్, చిటికేసి మహేష్, గందె హరిప్రసాద్, గుండా శివ పాల్గొన్నారు .

# అర్బన్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్ .




**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 15.**

జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని అర్బన్ది కాలనీలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మెట్ పల్లి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం సమాచారం మేరకు మెట్పల్లి ఎస్సై చిరంజీవితో పాటు సిబ్బందితో అర్బన్ కాలానికి వెళ్ళగా అక్కడ అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు మెట్పల్లి పట్టణానికి చెందిన పోతు అక్షయ్, బండి సాయిరాం అనే వ్యక్తులు కనిపించడం తో వారిని తనిఖీ చేయగా ఒక కవర్లో నిషేధిత గంజాయి ఉండగా ఇద్దరిపంచులను పిలిపించే వారి సమక్షంలో అతి గంజాయిని తూకం చేయగా 200 గ్రాముల గంజాయి ఉన్నట్లు సిఐ పేర్కొన్నారు . అట్టి గంజాయిని పంచుల సమక్షంలో పంచనామ రాసి స్వాధీనపరుచుకొని , తదుపరి చర్య నిమిత్తం అట్టి గంజాయిని వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను స్వాధీనపరుచుకున్నట్లు సిఐ తెలిపారు. ఇద్దరిని పోలీస్ స్టేషన్ తీసుకొని వచ్చి వారిపై కేసు నమోదు చేసే తదుపరి చర్య నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు ఇట్టి సమావేశంలో మెట్పల్లి ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఇకనుండి మెట్పల్లి సర్కిల్ పరిధిలోని మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలంలోని గ్రామాలలో ఎవరైనా నిషేధిత మత్తు పదార్థములను అమ్మినట్లయితే మాకు వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు. మేము వెంటనే స్పందించి నేరస్తులను పట్టుకుని కఠినంగా శిక్ష ఇస్తామని ఇస్తామని మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## మాజీ సర్పంచ్ భర్త అట్రాసిటీ కేసులో రిమాండ్.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 15.**

ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామానికి చెందిన సున్నం సత్యంపై అట్రాసిటీ కేసలో గురువారం సాయంత్రం రిమాండ్ కు పంపినట్లు మెట్పల్లి డిఎస్పి ఏ రాములు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం వేముల కూ ర్తి గ్రామానికి చెందిన లక్ష్మీపై మాజీ సర్పంచ్ భర్త సున్నం సత్యం అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ తన ఇంటిపై దాడి చేశాడని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డిఎస్పి రాములుతెలిపారు.

# గంజాయిని పట్టుకున్న మెట్ పల్లి పోలీసులు

**కరపత్రం ప్రతినిధి కోరుట్ల నియోజక వర్గం.**




మెట్ పల్లి శివారులోని అర్బన్ కాలనీలో ఉన్న ఆట స్థలం వెనుక ఒక చెట్టు క్రింద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండగా వారిని గమనించిన మెట్ పల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ నిరంజన్ రెడ్డి గారు నిన్న మధ్యాహ్నం పగలు మూడున్నర గంటల సమయంలో వారికి అందిన సమాచారం మేరకు ఎస్ఐ శ్రీ చిరంజీవి గారు మరియు ఇతర సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు.వారిని తనిఖీ చేయగా వారిద్దరి వద్ద ఒక కవర్లో నిషేధిత గంజాయి ఉండగా వెంటనే ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.ఆ కాలనీలోని ఇద్దరు పంచులను పిలిపించి వారి సమక్షంలో అట్టి గంజాయిని తూకం వేయగా 200 గ్రాముల గంజాయి ఉన్నట్టు తేలింది.అట్టి గంజాయిని సాక్షి ద్వారా పంచుల సమక్షంలో పంచనామా రాసి స్వాధీన పరచుకొని, అట్టి నేరస్థులను పోలీసు స్టేషన్ కు తీసుకువెళ్ళారు.ఆ నేరస్థులు ఒకరు పోతు అక్షయ్ మరియు ఇంకొకరు బండి సాయిరాం లు. ఇద్దరూ స్థానిక మెట్ పల్లి నివాసులు అని తేలింది.వారిని విచారించగా వారు ఇట్టి గంజాయిని నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుక్కొని మెట్ పల్లిలోని అర్బన్ కాలనీలో చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి ఒక్కొక్క ప్యాకెట్ ధర 500 రూపాయల చొప్పున అమ్మడానికి సిద్ధమవుతుండగా పట్టుబడ్డారని సి.ఐ. నిరంజన్ రెడ్డి మీడియాకు తెలిపారు.ఈ నేరస్థుల నుండి గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నామని సిఐ తెలిపారు.నేరస్థులైన ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తము కోర్టులో హాజరు పరచుతామని సిఐ తెలిపారు.మెట్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అట్టి ఇద్దరు నేరస్థులను ప్రవేశ పెట్టారు.ఇట్టి సమావేశంలో సిఐ నిరంజన్ రెడ్డి తో పాటు, మెట్ పల్లి ఎస్ఐ చిరంజీవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఇక నుండి వారి సర్కిల్ పరిధిలోని మెట్ పల్లి మండలం, ఇబ్రహీంపట్నం మండలం మరియు మల్లాపూర్ మండలం లోని గ్రామాలలో ఎవరైనా నిషేధిత మత్తు పదార్థములను అమ్మినట్లయితే మాకు వెంటనే సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.మీ సమాచారంతో,సహకారంతో మేము వెంటనే స్పందిస్తామని, వెంటనే అట్టి నేరస్తులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని మెట్ పల్లి పోలీస్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.మెట్ పల్లిలో తలెత్తుతున్న మత్తు పదార్థాల సరఫరాను సకాలంలో గుర్తించి, నేరస్థులను పట్టుకున్న మెట్ పల్లి సిఐని,పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

# విహెచ్అర్ ఫౌండేషన్ సభ్యునికి చేయూత అందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి

**కరపత్రం న్యూస్:పాలకుర్తి నవంబర్15:**



విహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అందరూ కూడా మా ఇంటి సభ్యులు అని ఎవ్వరికీ ఎలాంటి ఆపద వచ్చిన వారికి అండగా ఉంటామని వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఐ వ్యాళ్ల హరీష్ రెడ్డి అన్నారు.రామగుండం 30వ డివిజన్ విహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని వారికి వైద్య ఖర్చుల కోసం సహాయాన్ని అందించాలని ఫౌండేషన్ సభ్యులు, వ్యవస్థాపకులు హరీష్ రెడ్డికి చరవాణిలో సమాచారం అందించగా వారు వెంటనే స్పందించి వారి తండ్రి బిఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల రాంరెడ్డి తో శ్రీనివాస్ వైద్యం కోసం ఇరవై వేల రూపాయలు సహాయం అందిచాలని కోరగా వారు వేణు వెంటనే శుక్రవారం రోజున ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఇరవై వేల రూపాయలను వారికి అందిచి అండగా నిలిచారు. అంతేగాక ఈ నియోజకవర్గం లో ఎంతో మంది నిరుపేదలకు విహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా సహాయాన్ని అందిచి నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా హరీష్ రెడ్డి పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల రాంరెడ్డి మాట్లాడుతూ: ఎంతో మంది నిరుపేదలకు మా ఫౌండేషన్ ద్వారా మాకు తోచిన సహాయాన్ని అందిస్తున్నామని, అదేవిధంగా పలు సేవకార్యక్రమలు కూడా చేపట్టడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా వేయ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ: నేను అనారోగ్యంగా ఉండడంతో ఈ విషయాన్ని తెలుసుకొని మాకు తక్షణ సాహాయంగా 20 వేల రూపాయలు అందించిన విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ విహెచ్ఆర్ టీం సభ్యులతో పాటు,వివిధ డివిజన్ల ఫౌండేషన్ ఇన్చార్జ్లు, పాలకుర్తి మండల సభ్యులు పాల్గొన్నారు.

# కోటిలింగాల గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు




## - కోటేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరపత్రం : వెల్గటూర్ నవంబర్ 15:**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఉదయం నుండే పవిత్ర గోదావరి నదిలో కార్తిక స్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేసి గోదావరి నదిలో కార్తిక దీపాలను వదిలారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోటేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. భక్తులు పెద్ద ఎత్తున కోటేశ్వర స్వామి ధరించుకొనుటకు క్యూ లైన్ లో స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద ప్రదర్శనలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. ఈ యొక్క కార్తీకమాసంలో చాలామంది భక్తులు కూడా ఉపవాసం ఉంటారని కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో అభిషేకం చేసి దేవునికి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా చేయడం వలన కుటుంబంలోని అందరూ కూడా ఆయురారోగ్యాలు

# ఎన్టిపిసి కృష్ణనగర్ వాసులపై పెట్రోల్ పోసి దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

## భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ గుండెబోయిన లక్ష్మణ్ యాదవ్

**కరపత్రం రామగుండం నవంబర్, 15:**



మా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది మా కాంగ్రెస్ ఎమ్మెల్యే మాకు అండగా ఉన్నాడు మేము ఏది చేసినా కూడా పోలీసులు మా పై కేసు పెట్టారనే అహంకారంతో ఇందారం శ్రీనివాస్ అనే కరడు కట్టిన కాంగ్రెస్ నాయకుడు హిందువులపై పెట్రోలు పోసి తగలబెట్టడానికి ప్రయత్నించడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇలాంటి దుర్మార్గమైన చర్యలు మరొకసారి పునరావృతం కాకుండా ఇందారం శ్రీనివాస్ పై హత్యాయత్నం కేసును ఫైల్ చేసి కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాను స్థానిక ఎన్టిపిసి లోని కృష్ణా నగర్ వాసులందరూ కలిసి గత అనేక సంవత్సరాలుగా హిందూ దేవతల అయినా గణేష్ ఉత్సవాలు మరియు దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే స్థలంలో మండపాన్ని నిర్మించుటకు ముగ్గు పోస్తున్న సందర్భంలో హిందువులపై దాడికి పాల్పడి అక్కడికి వచ్చిన వారి అందరిపై పెట్రోల్ పోసి భయభ్రాంతులకు గురి చేసినటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇందారం శ్రీనివాస్ పై అటెంప్ట్ మర్డర్ కేసు బుక్ చేయాలని కాలనీ వాసులందరూ స్థానిక ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చిన సందర్భంలో కాంగ్రెస్ పెద్దలు అతనికి వత్తాసు పలుకుతూ కేసు బుక్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న సందర్భంలో కోపోద్రిక్తులైనటువంటి కాలనీవాసులు అందరూ స్థానిక ఎఫ్ సి ఐ ఎక్స్ రోడ్ వద్ద హైవే రోడ్డుపై బైటయించి రాస్తారోకోకు దిగడం జరిగింది కాలనీవాసులపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డ అటువంటి ఇందారం శ్రీనివాస్ ను అతనికి సహకరించిన కొందరు క్రిస్టియన్ ప్రముఖులపై కఠిన తరమైన కేసులు బుక్ చేసి మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోవాలని రాస్తారోకోలో హిందూ వ్యతిరేక శక్తులపై నినాదాలు చేస్తూ రాస్తారోకో చేయడం జరిగింది. రాస్తారోకోను నిలిపివేయాలని స్థానిక ఎన్టిపిసి సీఐ ప్రవీణ్ కుమార్ ఈ సంఘటనకు పాలుపడ్డ నిందితులను కఠినంగా శిక్షిస్తామని కాలనీవాసులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించడం జరిగింది. ఈ రాస్తారోకోలో కృష్ణానగర్ వాసులు హిందూ వాహిని కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు వివిధ పార్టీల నాయకులందరూ అధిక సంఖ్యలో పాల్గొని రాస్తారోకో చేయడం జరిగింది.



# నయన ప్రేమకథ అలా మొదలైంది..?

అగ్ర నాయిక నయనతారను ఆమె అభిమానులు లేడీ సూపర్‌స్టార్ అని గర్వంగా పిలుచుకుంటారు. బుల్లితెర ప్రయోక్తగా కెరీర్‌ను మొదలుపెట్టి అగ్ర కథానాయికగా ఎదిగిన ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ నేపథ్యంలో 'నయనతార: బీయాండ్ ది ఫెయిరీటేల్' పేరుతో ఆమె విజయవంతమైన సినీ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రూపొందిన డాక్యుమెంటరీ త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఇందులో ఆమె వ్యక్తిగత, సినీ జర్నీకి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయనతార ప్రేమాయణం, పెళ్లి వరకు సాగిన వారి ప్రయాణాన్ని కూడా ఈ డాక్యుమెంటరీలో వివరించారని తెలిసింది. ఈ సందర్భంగా విఘ్నేష్ శివన్‌తో తాను ప్రేమలో పడిన క్షణాలను నయనతార గుర్తు చేసుకుంది. విఘ్నేష్‌శివన్ దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీదాన్' (2015) సెట్స్‌లో తొలిసారి వీరిద్దరూ కలుసుకున్నారు. నయనతార మాట్లాడుతూ 'పాండిచ్చేరిలోని ఓ మారుమూల ప్రాంతంలో షూటింగ్ పెట్టారు. విజయ్ సేతుపతి మీద సీన్స్ షూట్ చేస్తున్నారు. అప్పుడే నేను దూరంగా విఘ్నేష్ శివన్‌ను గమనించా. మోముపై చెరగని చిరునవ్వు, సన్నివేశాన్ని వివరించే శైలి, దర్శకుడిగా అతని ప్రత్యేకమైన పనితీరు నన్ను ఆకట్టుకుంది. ఆ క్షణంలోనే అతని ప్రేమలో పడిపోయా' అని నయనతార చెప్పింది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ ప్రేమాయణం అనంతరం 2022 జూన్ 9న ఈ జంట వివాహం చేసుకున్నారు. ఈ దంపతులు సరోగసీ విధానం ద్వారా ఉయిర్, ఉలగం అనే కవల పిల్లలకు తల్లిదండ్రులయ్యారు.

# సూర్య 44పై ఎంతో ఎక్సయింటింగ్




కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు డైరెక్ట్ చేస్తున్న సూర్య 44. ఈ సినిమా ఎలా ఉండబోతుందో ఓ ఇంటర్వ్యూలో కార్తీక్ సుబ్బరాజు క్లారిటీ ఇచ్చేశాడు. సూర్య 44 గ్యాంగ్‌స్టర్ మాత్రమే కాదు. ఇది చాలా యాక్షన్ పార్ట్‌తో కూడిన ప్రేమకథ. సూర్య అండ్ పూజా హెగ్డే లాంటి నటీనటులతో లవ్ స్టోరీ చేస్తున్నానని చాలా ఎక్సయిట్ అయ్యానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ సినిమా ఎలా ఉండబోతుందో చెప్పకనే చెబుతూ సినిమా క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా.. పాపులర్ మాలీవుడ్ యాక్టర్ జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానిక ఇసంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీకి తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు . ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే అండమాన్ ఐలాండ్‌లో లాంగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన టీం.. పోర్ట్ బ్లెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించినట్టు ఇన్‌సైడ్ టాక్.

# దేవర-2పై అనుమానాలొద్దు



ఎన్టీఆర్ 'దేవర' సినిమా థియేటర్ రిలీజ్ 50 రోజులు పూర్తి చేసుకుంది. ఓటీటీ స్ట్రీమింగ్ తర్వాత థియేటర్‌లలో రన్ అయ్యి 50 రోజులు పూర్తి చేసుకున్న 'దేవర' సినిమా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రూ.500 కోట్లకు పైగా వసూళ్లు చేసిందని సమాచారం అందుతోంది. టాలీవుడ్ టాప్ చిత్రాల జాబితాలో నిలిచిన 'దేవర' సినిమాకు పార్ట్ 2 అవసరం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ, హీరో ఎన్టీఆర్ సైతం అదే ఫీల్ అవుతున్నారేమో అంటూ కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ మాత్రం ఆ ప్రచారంను తిప్పి కొడుతున్నారు. రూ.500 కోట్ల వసూళ్లు సాధించిన సూపర్ హిట్ సినిమాకి సీక్వెల్ చేయకుండా ఎలా వదిలేస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు.




# హాయ్.. నేను రానా దగ్గుబాటి..

## ట్రైలర్ షో విడుదల

టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గు బాటి కాంపౌండ్ నుంచి టాక్ షో సందడి చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ది రానా దగ్గుబాటి షో ట్రైలర్‌ను విడుదల చేశారు. హాయ్.. నేను రానా దగ్గుబాటి.. అవును ఇది ఒక షో. కానీ మీరంతా ఈ షో దేని గురించి ఆశ్చర్యపోతున్నారు. నాకింకా ఏం తెలియదు.. అంటూ ఇంట్రో మొదలుపెట్టాడు రానా.ఆ తర్వాత షోలోకి గెస్టులుగా నాగచైతన్య, శ్రీలీల, సిద్దు జొన్నలగడ, నాని, ప్రియాంకా ఆరుళ్ మోహన్, ఎస్ఎస్ రాజమౌళి, తేజ సజ్జా దుల్కర్ సల్మాన్, రాంగోపాల్ వర్మ, మీనాక్షి చౌదరి, రిషబ్ శెట్టి లాంటి స్టార్లు ఎంట్రీ ఇచ్చారు. స్టార్ సెలబ్రిటీలతో టాక్ షో ఉండబోతున్నట్టు రానా  తెలియజేశాడు. రానా అండ్ సెలబ్రిటీల స్టైల్‌లో సాగే ఈ సిరీస్ నవంబర్ 23న అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది. ఫిల్టర్ చేయని, స్క్రిప్ట్ లేని.. మరిచిపోలేనిది.. అంటూ విడుదల చేసిన ట్రైలర్ నెట్టింట వైరల్ అవుతోంది. రానా చేయబోయే షోలో రొటీన్ అంశాలే ఉండబోతున్నాయా.. ? లేదా ప్రేక్షకులకు కొత్త యాంగిల్ ఏమైనా చూపించడబోతున్నాడా..? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# కన్నప్పతోనైనా

## మంచు విష్ణుకు హిట్టు పడేనా..?



మంచు విష్ణు హీరోగా ఎంట్రీ ఇచ్చి రెండు దశాబ్దాలు దాటింది. ఇన్నాళ్ల సినీ ప్రస్థానంలో విష్ణు దక్కించుకున్న విజయాలు ఎన్ని అంటే చాలా చాలా తక్కువ అని చెప్పాలి. కెరీర్ ఆరంభంలో కాస్త పర్వాలేదు అనిపించినా గత పదేళ్ల కాలంలో ఆయన నుంచి వచ్చిన సినిమాలు తక్కువే, అందులో ఆయనకు ఒక్క హిట్టు కూడా లేదు. అయినా తన ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. ప్రస్తుతం భారీ బడ్జెట్‌తో స్వీయ నిర్మాణంలో మంచు విష్ణు 'కన్నప్ప' సినిమాను చేస్తున్నారు. మంచు విష్ణు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు పూర్తి అయింది. మొదటి పదేళ్లు స్పీడ్‌గా సినిమాలు చేసి, పర్వాలేదు అన్నట్లు ఫలితాలు సొంతం చేసుకున్న విష్ణుకు కొన్ని సూపర్ హిట్‌లు సైతం దక్కాయి. కానీ గత పదేళ్లుగా ఒక్క సినిమా సైతం హిట్ కాలేదు. పైగా ప్రతి సినిమా డిజాస్టర్, అంతకు మించి అన్నట్లుగా దారుణ ఫలితాలను చవిచూశాయి. విభిన్న చిత్రాలను ఎంపిక చేసుకుని, ప్రతి సినిమాకు చాలా కష్టపడుతున్నా మంచు విష్ణుకు ఆశించిన సక్సెస్ మాత్రం రావడం లేదనిపిస్తుంది. తనపై ఎంతగా విమర్శలు వచ్చినా, తన సినిమాలు ఎంతటి డిజాస్టర్‌ను చవిచూసినా తన ప్రయత్నాలను మాత్రం మానడం లేదు. సినిమాపై ఉన్న ఆసక్తితో వరుసగా ప్రాజెక్టులు చేస్తూనే ఉన్నాడు. ఈసారి ఏకంగా భారీ బడ్జెట్‌తో 'కన్నప్ప' అనే సినిమాను చేస్తున్నారు. మొదట్లో అనుకున్న స్థాయికి రెట్టింపు కన్నప్ప బడ్జెట్ చేరినట్టుగా కనిపిస్తోంది. భారీ క్యాస్టింగ్‌తో కన్నప్పను గ్రాండ్ లెవెల్లో విష్ణు నిర్మిస్తున్నాడు.

# కుబేర పోస్టర్ విడుదల

## కీలక పాత్రలో అక్కినేని నాగార్జున

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా కుబేర గ్లింప్స్ అప్‌డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్లింప్స్‌ను ఇవాళ సాయంత్రం 5:31 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటిస్తూ.. షేర్ చేసిన లుక్‌లో ధనుష్, అపార్ట్‌మెంట్స్, బిల్డింగ్స్, నోట్లను చూడొచ్చు. ఈ లుక్ గ్లింప్స్, సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అంటూ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. కుబేరలో పాపులర్ బాలీవుడ్ యాక్టర్ జిమ్ సర్భ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన జిమ్ సర్భ్ పాత్ర లుక్‌లో.. స్టైలిష్ సూట్‌లో నోట్ల కట్టల మధ్య నిల్చొని ఆసక్తిని రేకెత్తిస్తున్నాడు.

